క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



భజన చేస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రాంనగర్, ఆర్యనగర్‌లో ఆదివారం నగర సంకీర్తనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాంనగర్‌లోని రామ మందిరం నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన ఆర్యనగర్ గుండా కొనసాగింది. భక్తులు భజనలు, కీర్తనలతో పాదయాత్ర నిర్వహించారు. నగర సంకీర్తన తరువాత నిర్వాహకులు భక్తులకు అల్పాహారం అందచేశారు.

రెండో రోజుకు స్పెషల్‌డ్రైవ్ తనిఖీ



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి చేపట్టిన స్పెషల్‌డ్రైవ్ నారాయణఖేడ్ మండలంలో రెండో రోజుకు చేరుకుంది. అబ్బెందలోని 194, 195 పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న ప్రక్రియను తహశీల్దార్ దేవిదాస్ సందర్శించి పరిశీలించారు. అందిన దరఖాస్తుల వివరాలను బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యాంరావు ఉన్నారు.

నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించలేదని తెలిపారు.

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని టోల్‌గేట్ సమీపంలోని రామలింగేశ్వర దేవస్థానం, జేపీ కాలనీలోని ఉమామహేశ్వర దేవస్థానం, చైతన్యనగర్ కాలనీలోని మహాదేవుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయాల అర్చకులు తెలిపారు. శ్రావణమాసం నేపథ్యంలో సోమవారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అదేవిధంగా రామలింగేశ్వర దేవస్థానంలో అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ అర్చకులు మహేష్ తెలిపారు.

'బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుంది'

జహీరాబాద్ టౌన్: బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని జహీరాబాద్ బీజేపీ పరిశీలకులు, బీదర్ ఎమ్మెల్యే శైలేంద్ర బెళదళే అన్నారు. ఆదివారం స్థానిక బసవేశ్వర ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రమంతటా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించగా ఓటమి భయంతో జహీరాబాద్‌లో వాయిదా వేశారని, మూడేళ్లుగా కౌన్సిల్ లేక పోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. పట్టణంలో మొక్కుబడిగా డబుల్‌బెడ్ రూం ఇళ్ల పనులు ప్రారంభించగా ఇంతవరకు పనులు పూర్తి చేయలేదన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచందర్ రాజనర్సింహ్మా, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, అధికార ప్రతినిధి సుధీర్‌కుమార్, నాయకులు మల్లికార్జున్ పాటిల్, జనార్దన్‌రెడ్డి, సుధీర్ బండారీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

ఝరాసంగం(జహీరాబాద్): కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం ఝరాసంగంలో కాంగ్రెస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో జడ్పీటీసీ వినీల నరేష్‌కుమార్, ఎంపీపీ దేవదాసు, వైస్‌ఎంపీపీ మల్లన్న పాటిల్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శంకర్ పాటిల్, ఎంపీటీసీలు ఉమావతి మారుతిరావు పాటిల్, సంగీతగుండప్ప, శకుంతల, సర్పంచులు నవాజ్‌రెడ్డి, నందప్ప, రాంరెడ్డి, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

- భయాందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు
- షిఫ్టు పద్ధతిలో తరగతుల నిర్వహణ



ఊడిపడిన స్లాబ్ పెచ్చులు



శిథిలావస్థలో మల్‌చెల్మ హైస్కూల్

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ పాఠశాలల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. భవనాల పైపెచ్చులు, స్లాబ్ ఊడి పడుతుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోననే భయంతో ప్రైమరీ స్కూల్‌లో షిఫ్టు పద్ధతిలో పాఠాలు బోధిస్తున్నారు. జహీరాబాద్ మండలంలోని మల్‌చెల్మ, చిరాగ్‌పల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలు పూర్తిగా దెబ్బతిని శిథిలమైయ్యాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ, దివంగత బాగారెడ్డి స్వగ్రామం మల్‌చెల్మలో 1969లో ఉన్నత పాఠశాల భవనం నిర్మించారు. తెలుగు, ఉర్దూ మీడియం కలిపి 230 మంది విద్యార్థులు ఉన్నారు.

నెర్రలు వారిన పాఠశాల గోడలు

పాఠశాల భవనం గోడలు నెర్రలు వారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గత సంవత్సరం ప్రైమరీ స్కూల్‌కు షిఫ్టు చేసి ఉదయం 12.30 గంటల వరకు ప్రైమరీ, మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉన్నత పాఠశాల తరగతులను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా చిరాగ్‌పల్లి ఉన్నత పాఠశాల భవనం పరిస్థితి కూడా ఇలాగే ఉంది. పాఠశాలలో తెలుగు మీడియం ఉండగా 200 మంది విద్యార్థులు ఉన్నారు. గదులు పూర్తిగా దెబ్బతినడంతో ప్రాథమిక పాఠశాలలో ఏడాది నుంచి పాఠాలు బోధిస్తున్నారు. ఉదయం ప్రైమరీ, మధ్యాహ్నం హైస్కూల్ తరగతులను నిర్వహిస్తున్నారు.

తప్పని తిప్పలు

షిఫ్టు పద్ధతిలో పాఠాలు బోధించడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. సమయం తక్కువగా ఉండడంతో పాఠాలు అర్థం కావడంలేదని, రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని హైస్కూల్ విద్యార్థులు వాపోతున్నారు. ఒంటిపూట బడులు నిర్వహిస్తుండటంతో పిల్లలు చదువుపై శ్రద్ధ చూపడంలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

నిలిచిన నిధులు

కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 2012లో ఆయన మల్‌చెల్మ గ్రామాని వచ్చినప్పుడు హైస్కూల్‌కు రూ.2కోట్లు మంజూరు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేలా హైస్కూల్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు గ్రామ పరిధిలోని రెండు ఎకరాల స్థలాన్ని పాఠశాల భవనానికి ఎంపిక చేయగా నేటికీ పనులకు శ్రీకారం చుట్టలేదు. దీంతో నిధులు ల్యాప్స్ అయ్యాయి. అసంద్‌గంజ్, ధనసిరి గ్రామాలకు మన ఊరు– మన బడి కార్యక్రమంలో నిధులు కేటాయించి కొత్త భవ నాలు నిర్మిస్తుండగా శిథిలావస్థకు చేరిన మల్‌చెల్మ, చిరాగ్‌పల్లి పాఠశాలలకు నిధులు మంజూరు చేయకపోవడంతో విమర్శలు వస్తున్నాయి.

ప్రతిపాదనలు పంపాం



మల్‌చెల్మ, చిరాగ్‌పల్లి ఉన్నత పాఠశాల భవన నిర్మాణం కోసం మన ఊరు–మన బడి కార్యక్రమంలో డీఈఓ ప్రతిపాదనలు పంపారు. రెండు గ్రామాల పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో ప్రాథమిక పాఠశాల భవనంలో షిఫ్టు పద్ధతిలో తరగతులను నిర్వహిస్తున్నాం.

– బస్వరాజ్, ఎంఈఓ, జహీరాబాద్

బసవేశ్వరుడి జీవితం ఆదర్శం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: బసవేశ్వరుడి జీవితం ఆదర్శనీయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పట్టణంలోని ఉమామహేశ్వర దేవాలయం నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయం వరకు చేపట్టిన 16వ మహా పాదయాత్రను ఆదివారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఆయన మాట్లాడుతూ 12వ శతాబ్దంలో అభ్యుదయ సమాజం కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడని, ఆయన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, టీఎస్ టీపీఎస్ చైర్మన్ మఠం భిక్షపతి, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు బసవేశ్వర్, వీరశైవ సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాలకు అండగా ఉంటా

- ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు



ఆలయ నిర్వాహకులతో నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: ప్రజాసేవే లక్ష్యంగా సబ్బండ వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ కిర్బికాలనీలో ఆదివారం నిర్వహించిన మైసమ్మ, పోచమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మద్దతుతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థుల కేటాయింపులో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో ముదిరాజులు 60లక్షల మంది ఉండగా ఏ ఒక్కచోటా సీటు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా అన్నివర్గాల ప్రజలను కలుపుకుని ముందుకు సాగుతానని తెలిపారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు మురళీ, రాజ్‌కుమార్, వెంకటేశ్, అశోక్, ప్రవీణ్, రాములు, బాల్‌రాజ్, జనార్ధన్, వెంకటేశ్వరరావు, కాలనీవాసులు, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

నీలం మధుకు మద్దతు

జిన్నారం(పటాన్‌చెరు): ముదిరాజ్ నేత నీలం మధుకు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కేటాయిచాలని, ఈ విషయంలో నీలం మధుతోనే ఉంటామని జిన్నారం గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం జిన్నారంలో ముదిరాజ్‌భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధుకు అండగా ఉండాలని ముదిరాజ్ సంఘం నాయకులు తీర్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, కులపెద్దలు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కర్ణాటకలోని బసవకల్యాణ్ బీజేపీ ఎమ్మెల్యే శరణు సలగర అన్నారు. నారాయణఖేడ్‌లో ఆదివారం బీజేపీ ప్రవాస్ యోజన ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అవినీతి పాలన కొనసాగుతోందని ఆరోపించారు. బీజేపీకి అవకాశం ఇవ్వడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బోర్గి, చల్లగిద్ద తండా, ఎడ్లరేగడి తండా, కొత్తపల్లి, ర్యాలమడుగు, వంగ్దాళ్ తదితర గ్రామాల నుంచి యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి శరణు సలగర, జన్‌వాడే సంగప్పలు పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం పట్టణంలో భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మారుతి రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ రవికుమార్, నియోజక వర్గ కన్వీనర్ రజినీకాంత్, నాయకులు సాయిరాం, పట్నం మాణిక్, రామకృష్ణ, సుధాకర్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సిర్గాపూర్ మండలం గౌడ్గాం శివారులోని సాయిపరమహంస గోశాలను సందర్శించి గోవులకు పూజలు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ బ్రహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు దేశ్‌పాండే, కోశాధికారి కిషన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా షాపూర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ జోషి, ఉపాధ్యక్షులుగా సురేష్‌కుమార్, అక్షయ దేశ్‌పాండే, కార్యదర్శులుగా బూచినెల్లి సురేష్, రాజ్‌కుమార్ దేశ్‌ముఖ్, కోశాధికారిగా దేవిదాస్‌రావు, సభ్యులుగా రమేష్‌రావు, దిగంబర్‌రావు, గుడి ప్రకాష్, రాజ్‌కుమార్, అరుణ్‌దేశ్‌పాండే, మురళీధర్‌రావు, రఘు, రాజు ఎన్నికయ్యారు.

సబ్సిడీ గొర్రెల పంపిణీ

హత్నూర (సంగారెడ్డి): ప్రభుత్వం మంజూరు చేస్తున్న సబ్సిడీ గొర్రెలను గొర్రెలకాపరులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మల్లేశం అన్నారు. ఆదివారం హత్నూర మండలం నవాబుపేట గ్రామంలో పలువురికి సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సంధ్యారాణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యం



ప్రవీణ్‌సూర్యవంశీ పాటిల్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

- శాస్త్రవేత్త ప్రవీణ్ సూర్యవంశీ పాటిల్

నారాయణఖేడ్: విజ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యమని సిర్గాపూర్ మండలం వంగ్దాల్‌కు చెందిన స్పేస్ ఆర్గనైజేషన్ ఎక్స్‌పర్ట్, జూనియర్ శాస్త్రవేత్త ప్రవీణ్ సూర్యవంశీ పాటిల్ తెలిపారు. చంద్రయాన్–3 విజయవంతమైన సందర్భంగా నారాయణఖేడ్ మండలం ర్యాకల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం అంతరిక్ష పరిశోధనలు, విశ్వంలో మానవాళి అభివృద్ధి, విజ్ఞానంతో సాధించిన ప్రగతి, మంగళయాన్, సౌరమండల అధ్యయనం, భవిష్యత్తులో విజ్ఞాన ఆవశ్యకత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రయాన్–3లో శాస్త్రవేత్తల కృషి, విజ్ఞాన్, విక్రం ల్యాండర్ తదితరవాటిపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ప్రవీణ్ సూర్యవంశీ పాటిల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరాఠా సంఘం ఆధ్వర్యంలో.. సిర్గాపూర్ మండలంలోని వంగ్దాల్‌కు చెందిన స్పేస్ ఆర్గనైజేషన్ ఎక్స్‌పర్ట్, జూనియర్ శాస్త్రవేత్త ప్రవీణ్ సూర్యవంశీ పాటిల్‌ను ఆదివారం నారాయణఖేడ్‌లో మరాఠా సంఘం నాయకులు దిగంబర్‌రావు, కిషన్‌రావు తదితరులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ప్రవీణ్ సూర్యవంశీపాటిల్ ఖేడ్ సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థి కావడంతో ఆ పాఠశాల పూర్వవిద్యార్థులు సన్మానించారు. అనంతరం ఖేడ్ మండలం అనంతసాగర్‌కు చెందిన చిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకుపై ప్రవీణ్ సూర్యవంశీపాటిల్ చిత్రాన్ని మలచి బహూకరించారు.

సంక్షిప్త వార్తలు

◆ **'బీజేపీ జెండా ఎగురవేస్తాం'**

కొండాపూర్(సంగారెడ్డి): రాబోయే ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని లక్నో ఎమ్మెల్సీ అన్వేష్ కుమార్‌సింగ్ పాటిల్ అన్నారు. ఆదివారం సంగారెడ్డిలో బూత్ యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సంగారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ రాజేశ్వర్ రావుదేశ్‌పాండే, నాయకులు జగన్, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, పోచారం రాములు, శివరాజ్‌పాటిల్, ఎల్లయ్య, ప్రశాంత్‌కుమార్, పెద్దాపురం మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఓటరు నమోదుపై అవగాహన**

మునిపల్లి(అందోల్): మండలంలోని హైద్లాపూర్, బోడపల్లి, ఖమ్మంపల్లి, పొల్కంపల్లి గ్రామాల్లో ఓటరు నమోదుపై తహసీల్దార్ తెన్‌మొళి ఆదివారం ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బుత్‌లేవల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడిదల తహశీల్దార్ గంగాభవానీ సూచించారు. గుమ్మడిదల మండలంలోని 35 పోలింగ్ కేంద్రాలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లోని వసతులు, ఓటరు నమోదు, సరవణలు తదితర విషయాలను బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు.

◆ **రేపు ఉచిత వైద్య శిబిరం**

జిన్నారం(పటాన్‌చెరు): ఈ నెల 29న బొల్లారం మున్సిపల్ పరిధిలోని మల్లన్న దేవాలయ సమీపంలో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని గర్భిణులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మమత ఆస్పత్రి సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి

సదాశివపేట(సంగారెడ్డి): బంగారు మైసమ్మ అలయ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని హట్కర్‌పేటలోని బంగారు మైసమ్మ మందిరం ఆలయ ముఖద్వారం నిర్మాణానికి ముఖద్వారం నిర్మాణ దాత అడ్డగట్ల వెంకటేశం బ్రదర్స్, పట్టణ పద్మశాలి సమాజం అధ్యక్షుడు అంబటి విశ్వనాథంతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం చింతా గోపాల్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు, భక్తులు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, పద్మశాలి హట్కర్‌పేట సమాజం ప్రధాన కార్యదర్శి ఎన్నం మల్లేశం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



చింతా ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్



విద్యార్థులు, కరాటే మాస్టర్లతో చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): ఆత్మరక్షణకు కరాటే అవసరమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బసవ సేవాసదన్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్లు చందర్, శంకర్‌గౌడ్‌ల సమక్షంలో కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు నారాయణఖేడ్, సంగారెడ్డి, పటాన్‌చెరు, సదాశివపేట, ఝరాసంగం, జహీరాబాద్, జోగిపేట, కంది ప్రా ంతాల విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం ని ర్వహించిన కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు చింతా ప్రభాకర్ బెల్టులు ప్రదానం చే శారు. కార్యక్రమంలో మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చింతా ప్రభాకర్‌కు సన్మానం

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను మండల పరిధిలోని కొనాపూర్ సర్పంచ్ గోపులారం శోభరాణి, గొల్లగూడెం సర్పంచ్ మునిగే నవీన్‌కుమార్, ఎంపీటీసీల ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చి చింతా ప్రభాకర్‌కు సన్మానించారు. అదేవిధంగా కొనాపూర్ గ్రామ ప్రజలు చింతా ప్రభాకర్‌కు గొంగడిని బహూకరించారు. కార్యక్రమంలో ఎరుకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు సర్వేశం, సత్యనారాయణ, మల్లేశం, దుర్గయ్య, మిట్టప్ప పాల్గొన్నారు.

టీపీటీయూ మద్దతు

సంగారెడ్డి మున్సిపాలిటీ: బీఆర్‌ఎస్ సంగారెడ్డి అసెంబ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న చింతా ప్రభాకర్‌కు టీపీటీయూ నాయకులు సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో కలిసి ఆదివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ చింతా ప్రభాకర్ తమ సంఘం తరపునా మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న చిరంజీవి

నారాయణఖేడ్: అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీచర్లు, సహాయకులకు ఉద్యోగభద్రత కల్పించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలన్నారు. పదవీ విరమణ బెనిఫిట్స్ కింద రూ.5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరి, వీణాకుమారి, ఇతర బాధ్యులు శాంతాబాయి, స్వరూప, అనురాధ, సత్య, నిర్మల, లక్ష్మి, పుణ్యవతి, శ్యామల, పద్మ, అనిత, బాలమణి, యాదమ్మ పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో బోనాలు

పూజలు చేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ ఆదివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మతల్లికి కార్పొరేటర్ పుష్పనగేష్ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా భారతినగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీలో నిర్వహించిన బోనాల వేడుకలలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.